కథానిక

# ఇంద్ర ధనుస్సు

“రాజా”

వర్షం హోరుమని కురిసి వెలిసింది. ఆకాశంలో మేఘాలు అప్పుడప్పుడే చెదిరి పోతున్నాయి. చెట్లమీంచి, చూరునుంచి చినుకులు టపటపా నేలరాల్తున్నాయి. రాధ అలా తలుపు కానుకుని నుంచునే ఇంద్రధనస్సు వంక చూస్తోంది. ఇంద్ర ధనస్సు చూస్తే రాధ చిన్నపిల్లై పోతుంది. ఆమె మనసు గంతు వేస్తుంది.

“ఇందులో నిజంగా ఏడురంగు లున్నాయా? మరైతే అంత స్పష్టంగా కన్పించవేం? ఇంద్ర ధనస్సు నీటి చుక్కల వల్లే వస్తోందా? ఏమో. అదీ అనుమానమే. అన్నీ సందేహాలే. బి. ఏ చదివిన రాధ ఈ మాట గట్టిగా పైకి అనలేకపోతోంది. ఎవరన్నా వింటే నవ్వుతారని. ముఖ్యంగా తన రాజారావు వింటే మరి నవ్వడూ! అది అంతసేపు గాలిలో ఏం కట్టుకుని వేలాడుతాయి కదలకుండా “గాలిలో నాబ్రతుకు” అంటూ నుంచుంటాయా? ఈ ప్రశ్న వచ్చేటప్పటికి రాధ పెదవులమీదికి చిరునవ్వు పాకి వచ్చింది. అందుకే అన్నట్టు రాజారావు లోపలికి అడుగు పెట్టాడు.

“హుషారు ఎక్కువైందే అమ్మాయికి ఇవ్వాళ.” తుళ్ళిపడింది రాధ. వెంటనే సిగ్గుపడింది. తన ఆలోచనలు తెలిశాయేమోనని. మళ్ళీ ఎల్లా తెలుస్తాయి పైకి అనలేదుగా అని సర్దుకుంది.

“భయపడ్డావా పిచ్చిపిల్లా. ఎందుకు ఉలిక్కిపడ్డావ్?” సైకిల్ లోపల పెడుతూ అడిగాడు రాజారావు

“భయం కాదు...” అదేమిటో చెప్పలేక పోతుంది రాధ

“అయితే ఊహాలోకాన్నుంచి ఈ లోకానికి వచ్చేటప్పటికి మధ్యలో కుదుపు అన్నమాట ఈ మధ్యలో రైళ్ళలాగ”

సైకిల్ లోపల పెట్టి బూట్లు విప్పుతూ అన్నాడు తనూ, రాధా కలిసి ఆ మధ్యనే చేసిన ప్రయాణం జ్ఞాపకం చేసుకుంటూ రాధకు కూడా అదే జ్ఞాపకం వచ్చింది. ఇద్దరూ కలిసి ఫక్కున నవ్వారు.

“రాజా!”

“ఏమిటి రాణీ!”

“ఇదుగో అదే వద్దన్నా. మా వాళ్లు నాకు అలా ఏమీ నామకరణం చెయ్యలేదు తెలుసా” చిరుకోపం చిందులాడింది రాధ ముఖంమీద. తీక్షణంగానే అంది లోపల నవ్వుకుంటున్నా. ఆ సంగతి అతనికీ తెలుసు.

“మా వాళ్లు నాకు రాజా అని ఏమీ నామకరణం చెయ్యలేదు. నన్ను అల్లా పిలవకు.” ఇంకొంచెం కోపంగా ముఖం పెట్టాడు. కాని నవ్వాపుకోలేక అటు తిరిగాడు.

“ఇదిగో, ఇటుచూడు” అది ఆజ్ఞేమో వెంటనే “జోహుకుమ్” అంటూ తిరిగాడు.

“నువ్వెప్పుడూ ఏదోవక గొడవతోటే వస్తావు. నేనొకటి అడగాలి విను.” షర్టు బొత్తాలు తీస్తూ అంది రాధ. ఒక్కక్షణం ఆగి “నవ్వవుగా మరి” అంది తలెత్తి రాజా కళ్ళలోకి చూస్తూ.

“సావధాన చిత్తుడనై ఆలకించెద కానిమ్ము దేవీ...రాణీ కాకపోతే దేవీ అవచ్చు. వాటన్నిటికీ ఒకటే కాదుకదా మీనింగ్. పయ్‌లిటరేచర్.” చిలిపిగా చూస్తున్నాడు అతను.

“అబ్బబ్బ ఒక్కక్షణం సీరియస్‌గా వినలేవు గదా నేనడిగేదానికి చెప్పు. రైన్‌బో వర్షం చినుకులమీద సూర్యుడి కిరణాలుపడి రిఫ్లెక్షన్‌వల్లనే వస్తుందంటారు. అవునా!”

“వస్తుందేమిటి నీ మొహం. కన్పిస్తుంది అనూ” పకపక నవ్వేశాడు. రాధముఖం చిన్నబుచ్చుకుంది.

“తెలిస్తే చెప్పకపోతే మానెయ్యండి మాకంత తెలియడానికేమీ ఫిజిక్స్ చదవలేదుగామరి” లోపలికి వెళ్ళిపోయింది రాధ. కోపం వచ్చినప్పుడు బహువచనం వాడడం రాధ కలవాటే. అది ఒక వార్నింగ్ కూడా.

అదికాదు రాధా, నీకు ఆమాత్రం తెలియదు. అదే అడుగుతే నవ్వొచ్చింది. కాని అసలు సందేహం చెప్పమరి" కాఫీ కప్పు అందుకున్నాడు.

"నీటిచుక్కలు అక్కడే నుంచునీ వుండిపోతా ఏమిటి?"

ఈసారీ నవ్వువచ్చినా బలవంతాన ఆపుకున్నాడు పేపర్ అందుకుంటూ "అందుకే నిన్ను పిచ్చిరాధా అన్నాను. ఎట్మాస్ఫియర్‌లో వాటర్ వేపర్ వుండదూ. అలాగే వర్షం కురవగానే నీటి చుక్కలు నిలుస్తాయి. అవేం పెద్ద పెద్ద బిందెడు నీళ్ళనుకున్నావా, మీవాళ్ళిచ్చిన పానకం బిందెల్లా బరువుకి పడిపోడానికి..."

"నిజమే. ఈ ఆలోచన రాలేదు నాకు" అని తన తెలివితక్కువకి తను నవ్వుకుంది రాధ. పేపర్ చాటుగా రాధ ముఖం ఓసారి చూసి ఆ లోకంలో పడ్డాడు రాజా. కిటికీలో కూర్చుని ఆకాశంవంక చూస్తోంది రాధ.

"రాధా."

ఏదో హడావిడిగా పిల్చాడు, ఆ పిలుపు శ్రుతి సౌందర్యాన్ని అవలోకిస్తూ క్షణంకిందట ఎంతో సౌందర్యంతో, రంగు రంగులతో, అందరినీ మురిపించాననే గర్వంతో మెరిసిన ఆకాశం క్షణంలో కారుచీకట్లతో చిన్నబోడం గురించి ఆలోచిస్తోంది.

"రాధా."

ఈసారి ఇంకొంచెం గట్టిగా పిల్చాడు.

"ఏమిటి?" వెనక్కి తిరిగి దగ్గరకు వస్తూ అడిగింది రాధ. సమాధానంగా పేపర్ చేతికి అందించాడు రాజారావు.

"నే చూసేశాగా!"

"నిజంగానా!" ఏదో మెరుపులా తళుక్కుమంది అతని ముఖంలో.

"నువ్వనేదేమిటి?"

"చూశానన్నానుగా. నీకుకూడా జాబ్ దొరుకుతోంది. ఇదిగో వాంటెడ్ కాలమ్స్ చూడు."

రాధ ముఖంలో ఏమీ వుత్సాహం వుండకపోడం చూసి రాజా ఆశ్చర్యపోయాడు.

రాధ ఎన్నడూ ఉద్యోగం చేస్తానని తనతో అనలేదు. నిజమే. కాని చదువుకున్నదెందుకు? చదువుకున్న అనేకమంది స్త్రీలు ఉద్యోగాలు చేస్తామని చెప్పుకోడం, పట్టుబట్టడం, భర్తలతో పోట్లాడడం తనెరుగును. తన స్నేహితుడు-భార్యా ఈ విషయంలోనే తగువువచ్చి విడాకులదాకా వెళ్ళడం తనకి తెలుసు.

అల్లాంటప్పుడు మామూలుగా అందరిలాగే చదువుకున్న ఆడది అయిన రాధ ఏమాత్రం ఇందులో వుత్సాహం చూపించకపోడం తనకీ, తన అహంభావానికీ దెబ్బ అనిపించింది అతనికి. అతనిది స్త్రీ పురుషుడితో బాటు అన్ని విషయాల్లోనూ సమంగా వుండాలనే తత్వం. అందుకనే పెళ్ళయిన ఈ ఆర్నెల్లలోనూ తన వూళ్ళో ఏదన్నా ఉద్యోగం రాధకు దొరుకుతుందేమో అని చూశాడు. ఈనాటికి ఆ రోజు వచ్చింది.

ఎంతో సంతోషంగా వుంటుందనుకున్న రాధలో అలాంటి ఛాయలేవీ కన్పించకపోడంలో అతను ఆశ్చర్యపోయాడు.

పైగా రాధ అదోరకంగా మందహాసం చేసి పేపర్‌వంక చూసింది. తర్వాత టేబుల్ మీద పడేసి నిశ్శబ్దంగా పక్కనున్న సోఫాలో కూలబడింది.

రాజారావు తదేకంగా ఆమె ముఖంలోకే చూస్తున్నాడు ఏమన్నా అంటుందేమోనని. అతని ఆశ నిరాశ అయింది.

"రాధా, నీ ఉద్దేశం ఏమిటి?" అని సూటిగా అడిగాడు.

"నా ఉద్దేశానికేముంది" అదేమిటో ఇదివరకే చెప్పినట్టు అనేసింది రాధ.

"అంటే...!" అర్థంకాని రాజా వ్యర్థప్రశ్న.

"నాకు ఉద్యోగం చెయ్యడం ఇష్టంలేదు." ఎంతో మామూలుగా చెప్పి అతని ముఖంలోకి చూసి లేచి వంటింట్లోకి నడిచింది రాధ.

ఇలాంటి అఘాతానికి తట్టుకోవలసి వస్తుందని అతనెన్నడూ వూహించలేదు. సామాన్యంగా ఆలోచిస్తే అదో పెద్ద దెబ్బేమీ కాదు. కాని కొందరి మనసులు అతి సున్నితంగా వుంటాయి. గాజు గ్లాసుల్లాగా. ఇట్టే కొద్దిదానికే టప్ మనేలా. రాజారావు రాధ వికసిత ముఖారవిందయై మందస్మిత మృదు మధుర వచనోక్తులతో అతన్ని సత్కరిస్తుందనుకున్నాడు కాని...

స్త్రీలకు తను పురుషులతో బాటు సర్వ హక్కులూ ఇస్తానని చదువుకునే రోజుల్లో ప్రతిజ్ఞ పట్టాడు. మనస్ఫూర్తిగా ఆది నిలబెట్టుకోవాలనే ప్రతి పనీ చేస్తున్నాడు.

ఇప్పుడు తన కర్తవ్యం ఏమిటి ఏమీ తోచక వంటింటివేపు నడిచాడు.

"రాధా"

ఎసట్లో బియ్యం పోస్తున్న రాధ పక్కకి తిరిగి చూసింది.

"నీకు ఈ జాబ్ ఇష్టంలేదా. ఏదీనా?" చచ్చు ప్రశ్న కాకపోతే ఏమిటి.

"దానికోసం ఎందుకంత ఫీలవుతావు రాజా. ఇప్పుడు నేను వుద్యోగం చెయ్యకపోతే నష్ట మేమిటి? నువ్వు సంపాదించేది మనకి చాలకనా. మనకా. మనిద్దరమే దేనికింద ఇదవుతావు చెప్పు."

తను దేనికంత "ఇద"వుతాడా తను చెప్పలేదు. మాట్లాడకుండా ఇవతలికొచ్చి కూర్చున్నాడు రాజా.

వెనకాలే రాధావచ్చి కిటికీదగ్గర నుంచుని చంద్రుడికేసి చూస్తూ ఆలోచిస్తోంది.

"ఏమిటో ఈ మగాళ్ళ మనస్తత్వాలు తన కొద్దు బాబో అంటే చెయ్యమంటాడు తన భర్త. అవసరం లేకపోయినా ఎంతోమంది అవసరం వచ్చినా చెయ్యనియ్యరు చెప్తామన్నా."ఆన్ లైక్ పోల్స్" అని ఎప్పుడూ రాజా అనేమాట జ్ఞాపకం వచ్చి నవ్వుకుంది రాధ.

ఇంతవరకూ ఏ రోజూ తాము పోట్లాడుకో లేదు. ఈ రోజు ఏమిటో ఇది దేనికి దారితీస్తుందో అని ఒక్కసారి భయపడ్డది రాధ స్వచ్ఛమైన ఆకాశంలా ఈ ఆర్నెల్లూ గడిచాయి. ఈ వుద్యోగం అనే మబ్బులు దట్టంగా కమ్ముకుంటున్నాయి. ఇంద్ర ధనస్సులాంటి రాజా మనసులోంచి తను ఇన్ని రోజుల్నుంచీ చూడని రంగులు ఇప్పుడు చూస్తోంది. మళ్ళీ ఆకాశంలో చల్లని చంద్రుడు ఎప్పటి కుడ ఇస్తాడో. ఎల్లాగైనా సర్ది చెప్పాలని ఇవతలికి వచ్చింది రాధ. అదే టైమ్‌కి రాజా కూడా నోరు విప్పాడు.

"రాధా. నువ్వు నన్ను తప్పుగా అర్థం చేసుకున్నావు. నేను నిన్ను డబ్బుకోసం ఉద్యోగం చెయ్యమనలేదు. కాని నా మాటను నిలబెట్టుకోవాలనే. ఏం రాధా. అసలు నీకు అందులో బాధేమిటి?" అని తను చెప్పలేదు. కాని తనకి ఇష్టంలేదు.

"ఏమో. అదంతా నాకు తెలియదు. కాని నాకు ఇష్టంలేదు" లోపలిదే పైకి చెప్పింది.

"అయితే నువ్వు చదువుకున్న దెందుకు?" రాజాకి కోపంతో బాటు పట్టుదలా వొచ్చింది.

"చదువుతే వుద్యోగం చెయ్యాలని రూలా?"

"లేదు-లేదు. అంట్లు తోము అప్పలమ్మలా" వెక్కిరిస్తూ నవ్వాడు రాజా. ఆ మాటల్లో వున్న వ్యంగ్యం ఆమెకు గట్టిగానే తగిలింది. ఒక్కసారి అతని వంక చూసి ఇన్నాళ్లు తను పొరబడ్డానను కుంది. రాజాలో వున్న రంగులు ఒక్కొక్కటి బయటపడుతున్నాయి అన్నమాట అనుకుంది. ఏ రోజూ ఎవ్వరిచేతా మాట అనిపించుకోని రాధకు అవమానంలో గిర్రున కళ్ళనీళ్లు తిరిగాయి. ఎందుకో అతనికో పట్టుదల...

"క్షమించండి. నేనా వుద్దేశంతో ఎప్పుడూ చదువుకోలేదు. కనీసం మన పెళ్లికి ముందు అడిగినా చెప్పేదాన్ని. మీకు ఇష్టమైన, మీ ఆశయాలకు అనుగుణమైన మరోదాన్ని చేసుకునే వారు. కాని నేనుమాత్రం అంత ప్రాణావసరం వస్తే తప్ప ఉద్యోగం చెయ్యను. చెయ్యలేను." గట్టిగా, గద్గదికంఠా చెప్పింది రాధ వొక చేత్తో కన్నీళ్లు వత్తుకుంటూ.

రాధ కన్నీరు రాజా చూడ్లేక పోయాడు. ఒక్కసారి తన ప్రవర్తన సింహావలోకనం చేసుకున్నాడు. తనెంత అమానుషంగా ప్రవర్తించాడు. ఇతరులు ఏమన్నా అనుకుంటారనీ, తన ఆశయాలనీ, తన రాధని బాధపెట్టడమా. తన ఆశయం కోసం ఆమె ఆశయాలని మార్చడం తన ఆశయమా? తన ఆలోచనలన్నీ మంచులా కరిగాయి.

"డార్లింగ్ ఎందుకంత ఇదవుతావు. ఛా. వూరుకో. తమాషాకి నువ్వేమంటావో చూద్దామని అన్నానంతే. నీకు ఇష్టం లేకపోతే అంత బలవంతం ఏముంది?" కన్నీళ్లు తుడుస్తూ తల నిమిరాడు రాజా.

ఇది ఇంకో రంగేమో అనుకుంది రాధ.

"తల నొప్పిగా వుంది ఇవాళ" అన్నాడు రాజా భోజనానికి లేస్తూ.

"నిజంగానా" నుదురుమీద జాలిపడుతూ చెయ్యి వేసింది రాధ.

"జ్వరం కాదు డియర్. కాస్సేపు సరదాగా కబుర్ల కోసం" నవ్వుతూ, కొంటెగా చూశాడు. ఇంద్ర ధనుస్సు మాయమై ఎప్పటి వినీలాకాశం ప్రత్యక్షమౌతోం దనుకుంది రాధ. చంద్రోదయం తర్వాత ఎలాగూ వుంటుందనే నమ్మకంతో.

"మరి నేను వుద్యోగం చేస్తే అప్పుడు నాకు మాత్రం విసుగ్గా వుండదూ. మీలా ఇన్ని ఫైళ్లు ముందర వేసుకోవలసి రాదు. కబుర్లు అప్పు డెవరు చెప్తారో ఈ కామరాజుకి."

"కొంప తీశావ్" ఒక్క కేక పెట్టాడు రాజా.

"ఏం - ఏమయింది?" గాబరాగా అడిగింది.

"నా పేరు కామరాజు కాదు రాణీ" అన్నాడు రాజా.

"అదిగో మళ్ళీ" అంది రాధ.

"తగ్గాం" అంటూ ఇవతలికి వచ్చాడు వంట ఇంటిలోంచి.

ఆఫీసు ఫైల్ విప్పుతూ "నేనేం సుఖపడు తున్నాను వెధవ వుద్యోగంతో. కానీ నాకు తప్పదు. పాపం దానికెందుకు. నాలో అంతర్గ తంగా వున్న జెలసీ అల్లా అనిపించిందేమో" అను కున్నాడు రాజా.

---

# చీకటి బావుటా

"మసూనా"

ఏదీ చీకటి ఎక్కడ
ఏదీ ఎక్కడ చీకటి?

వచ్చేవా చీకటి!—నీ
ముచ్చట తీర్చుకొనన్, యే
సచ్చరితుని నట్టింటను
చతికిలబడ వచ్చేవు?—

ముగ్ధ మనోహర హృదయ
మ్ముల లోపల చిచ్చుపెట్టి
ఉప్పొంగెదవా చీకటి!
ఓ అకటి పెంజీకటి!!

అమాయకుల గుండెలపై
నా, నీ నాట్య క్రీడలు?

అభాజనుల పొట్టలపై
నా, నీ నడకల బెడగులు?—

ఎన్ని! నిండు కుటుంబాల
చిన్నచూపు చూచినావొ?
పచ్చని సంసారము లెటు
వెచ్చబెట్టి కలికి నావొ!—

'నిరాశ'యను చెలిమికత్తె
నీ పతాక గొని నడువగ,
నిద్దుర పెద్దమ్మ, ఏడుపు
ముద్దరాలు వెంటనంట
జైత్రయాత్ర వెడలుట, నీ
సరదావా! సరి-నీ
హింసావ్యస నమ్మదింక
ఎన్ని నాళ్లు సాగును లే!—

నీ ఆటలు కట్టించుట
నిముసము పట్టదునమ్ముము
నీ కోటలు వశపరచుట
నిముసమైన కాదు సుమ్ము—

సహస్రకరముల దశది
శల్, చాచి నిన్నందుకొనెడు
భాస్కర ప్రభాభాసిత
పౌరుషమ్ము మరువవద్దు—

నీ పతాక దింపి, నిను, భూ
స్థాపితమ్ము చేయగలుగు
చీకటీ! మా నట్టిళ్ళను
చేరకు-మము సోకకుమా—

అకటి రాజ్యాలు దాటి
అటుపై పైకేపో
అశాంతి శోకాల మమ్ము
ఆచ్ఛాదింపక పో!—